కుల, మతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్ కొనియాడారు. కళాశాలలో సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, జువాలజీ విభాగాధిపతి మీనాక్షి,జువాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ వెంకటరమనయ్య, డాక్టర్ రమేశ్, డాక్టర్ ప్రభాకర్ విద్యార్థులు పాల్గొన్నారు. **- సుల్తాన్‌బజార్, జనవరి 3**

సావిత్రిబాయి పూలే 193వ జయంతి ఉత్సవ సన్మాన గ్రహీత ఝాన్సీ ముదిరాజ్‌ను అభినందిస్తున్న అఖిల భాతర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ **- అబిడ్స్, జనవరి 3**

సావిత్రీబాయి ఫూలే చిరస్మరణీయురాలు

సుల్తాన్‌బజార్, జనవరి 3 : తెలంగాణ మహిళా యూనివర్సిటీకి సావిత్రీబాయి పూలే పేరు పెట్టాలని సామాజిక వేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నిజాం కళాశాలలో బీసీ సెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రిన్సిపాల్ భీమాతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంచ ఐలయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాను ఉపయోగించుకొని ప్రచార కార్యక్రమం చేపట్టాలన్నారు. తల్లిదండ్రులు కష్టపడి శ్రమిస్తున్నప్పుడు విద్యార్థులు ప్రతి రోజు గంటల తరబడి పుస్తకాలను చదువాలని సూచించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని సంపాదించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, బీసీ సెల్ కో – ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు,

మాట్లాడుతున్న సామాజిక వేత్త కంచ ఐలయ్య

ప్రొఫెసర్ మోహన్‌రెడ్డి, పీఆర్వో డాక్టర్ సీహెచ్. పరంధాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

బి లీడర్ అవార్డు అందుకున్న వెంకటేశ్

అబిడ్స్, జనవరి 3 : ప్రజా సేవలో కృషి చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్‌ను తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ది లీడర్ అవార్డుతో సన్మానించింది. సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను సమితి ఆధ్వర్యంలో నాంపల్లి గాంధీభవన్ ప్రకాశం హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్ గౌడ్ విచ్చేసి వెంకటేశ్‌ను శాలువాతో సన్మానించి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, బీఈ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బి. దుర్గారావు, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ సంఘ వీరప్ప, మహిళా అధ్యక్షురాలు కొత్త బాయమ్మ పాల్గొన్నారు.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా ది లీడర్ అవార్డు అందుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత

తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం నాయకులు బుధవారం శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం అధ్యక్షుడు కెంబసారం కృష్ణ, ప్రధాన కార్యదర్శి కూరాకుల కృష్ణ, సలహాదారులు చంద్రయ్య, నర్సింహ,ఉపాధ్యక్షులు డి.కృష్ణ, కుత్తడి రవి, కార్యదర్శులు బాబూ రావు, ప్రేమ్‌కుమార్, భుజంగం, ముత్యాలు పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, జనవరి 3**

కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఐ.రాణి కుముదినీని తన కార్యాలయంలో తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి వి.శ్రీనివాస్, కోశాధికారి చాంద్‌పాషా, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, సంయుక్త కార్యదర్శిగా జ్యోతి, సభ్యులు సుదర్శన్, శివానాయక్, నాగరాజు శుభాకాంక్ష లు తెలిపారు. **- సుల్తాన్‌బజార్, జనవరి 3**

జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ అనుబంధంగా ఉన్న మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్‌ను కలిసి విన్నవించారు. యూనియన్ నాయకులు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇవ్వాలని వారు కోరారు. రవాణా ఉద్యోగులు, శానిటరీ ఉద్యోగులు, ఎంటమాలజీ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు. మహిళా కమిటీ అధ్యక్షురాలు మారీ,

నాయకులు సత్యనారాయణ, యాదగిరి, జహీరుద్దీన్ పాల్గొన్నారు. **- అబిడ్స్, జనవరి 3**

ఉద్యోగుల సమస్యలపై అవగాహన ఉందని, సంఘాలతో చర్చించి పరిష్కరిస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. టీఎస్జీవో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్ ఉప ముఖ్యమంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. **- సుల్తాన్‌బజార్, జనవరి 3**

సదస్సులో మాట్లాడుతున్న ఉస్మానియా ఉప కులపతి రవీందర్

రాజ్యాంగంలోని సంక్లిష్ట
పదాలపై అవగాహన ఉండాలి

చార్మినార్, జనవరి 3 : రాజ్యాంగంలో సంక్లిష్ట పదాల భావాలను విద్యార్థులకు విపులంగా విశదీకరిస్తూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉప కులపతి రవీందర్ తెలిపారు. సిటీ కాలేజీలో రాజనీతి శాస్త్రం, ఢిల్లీ కమిషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజ్యాంగ్యంలో పొందుపర్చిన 4వేల సాంకేతిక పదాలను దేశీయ కోణంలో మార్చుకోవాలని తెలిపారు. పీఠికలోని సామాజిక న్యాయం,లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద పదాలు అర్థ చేసుకోవాలని ఆచార్య వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలబాస్కర్, ప్రత్యేక ఆహ్వానితులు షహజాద్, ఉప ప్రిన్సిపాల్ అయిజాజ్ సుల్తానా, అధ్యాపకులు విప్లవ్‌దత్ శుక్లా, తిరుపతి, శంకర్, పావని, కృష్ణవేణి, శ్రీనివాస్, వివిధ కళశాల రాజనీతి శాస్త్ర ఆచార్యులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఎన్జీఓస్ యూనియన్ పంజాగుట్ట డివిజన్ క్యాలెండర్‌ను అబిడ్స్‌లోని మయూర్ కుశాల్ కాంప్లెక్స్‌లోని పంజాగుట్ట డివిజన్ కార్యాలయంలో ఆ శాఖ జాయింట్ కమిషనర్ దీపారెడ్డి ఆవిష్కరించారు. **- అబిడ్స్, జనవరి 3**

గోల్కొండ కార్పొరేటర్ భర్త గుండెపోటుతో హఠాన్మరణం

బద్రుద్దీన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

మెహిదీపట్నం, జనవరి 3 : గోల్కొండ ఎంఐఎం కార్పొరేటర్ భర్త, ఎంఐఎం నాయకుడు బద్రుద్దీన్(45) అలియాస్ బదర్ మంగళవారం అర్ధరాత్రి గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. మంగళవారం సాయంత్రం వరకు ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని రాత్రి 11 గంటల వరకు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ వద్ద చర్చించి వెళ్లిన బద్రుద్దీన్ తన ఇంటి సమీపంలో ద్విచక్రవాహనంపై నుంచి పడి పోయారు. స్థానికులు అక్కడికి చేరుకుని పరీక్షించగా అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను నానల్‌నగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని డాక్టర్లతో మాట్లాడారు. తీవ్రమైన గుండెపోటుతో బద్రుద్దీన్ చనిపోయారని డాక్టర్లు తెలిపారు. బుధవారం గోల్కొండలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గోల్కొండలో జరిగిన అంత్యక్రియలకు ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వచ్చి కుటుంబసభ్యులను పరామర్శించారు. బద్రుద్దీన్ సోదరుడు ఫరీదుద్దీన్ కూడా గతేడాది గుండెపోటుతో మృతి చెందాడు.

బద్రుద్దీన్ (ఫైల్)

ఎగ్జిబిషన్‌లో సందర్శకుల సౌకర్యార్థం బందోబస్తు

ఎగ్జిబిషన్ పోలీసు ఔట్ పోస్టును ప్రారంభించి మాట్లాడుతున్న డీసీపీ శరత్‌చంద్ర పవార్, అబిడ్స్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ శంకర్

అబిడ్స్, జనవరి 3 : ఎగ్జిబిషన్‌లో సందర్శకుల సౌకర్యార్థం పోలీసు శాఖ తరపున బందోబస్తు ఏర్పాటు చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పోలీసు ఔట్‌పోస్టును డీసీపీ ప్రారంభించారు. సమావేశంలో డీసీపీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ లోపల, బయట సీసీ కెమెరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తున్నామన్నారు. అజంతా, గోషామహల్, గాంధీ భవన్, వీఐపీ గేట్ల వద్ద పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. సందర్శకులను మెటల్ డిటెక్టర్ల ద్వారా తనిఖీలు చేసి అనుమతి ఇస్తామన్నారు. అమ్యూజ్‌మెంట్ విభాగం రద్దీ ఉండే స్టాల్ వద్ద పోలీసులు మఫ్టీలో ఉండి నిఘా చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసులను సంప్రదించాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల డీసీపీ ఆనంద్, అబిడ్స్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, బేగంబజార్ పోలీస్ ఇన్స్పెక్టర్ శంకర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాండ్ హోటల్ సిబ్బందికి
బెయిల్ మంజూరు

నాంపల్లి కోర్టులు, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : అబిడ్స్ పీఎస్ పరిధిలో నమోదైన కేసులో గ్రాండ్ హోటల్ సిబ్బందికి బెయిల్ మంజూరు చేస్తూ 2వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు నిందితులు మైనర్లు కావడంతో బాలల కోర్టులో బెయిల్ మంజూరైంది. డిసెంబర్ 31 రాత్రి ధూల్‌పేట్ గంగాబౌలికి చెందిన సుమిత్‌సింగ్ ఎనిమిది మంది కుటుంబసభ్యులతో గ్రాండ్ హోటల్‌కు వచ్చారు. బిర్యానీలో మాంసం సరిగా ఉడకలేదని యాజమాన్యానికి తెలియజేయడంతో గొడవ జరిగిందని పోలీసులు నమోదు చేసిన రిమాండ్ కేసు డైరీలో పేర్కొన్నారు. కుటుంబసభ్యులపై వెయిటర్లు దాడికి పాల్పడినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ 324, 504, 506 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు.